క్లుప్తంగా

వాహనాల తనిఖీ



డోర్నకల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్‌లోని అమ్మపాలెం క్రాస్ రోడ్డు, ముల్కలపల్లిలో గురువారం చెక్‌పోస్టులు పునఃప్రారంభమయ్యాయి. జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

క్రీడల్లో రాణించాలి



పెద్దవంగర : యువత క్రీడల్లో రాణించేందుకు సహకరిస్తానని రావుల వెంకట రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిట్యాలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన తండ్రి సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.10 వేలు విలువ గల టీషర్టులను (జెర్సీ) క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



గూడూరు : మండలంలోని మట్టెవాడ, ఊట్లతో పాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో ఆయా గ్రామాల్లో పాత ఇళ్లు, పెంకటిళ్లపై కప్పులు లేచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ఈ క్రమంలో మట్టెవాడకు చెందిన తాటి విష్ణు పెంకుటిల్లుపై ఓ చింతచెట్టు కూలింది. అదే సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా, రెప్పపాటులో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రెడ్యానాయక్ కాలనీలో నివాసం ఉండే దరిపెల్లి కృష్ణమూర్తి ఇంటి వెనకాల ఉన్న కొబ్బరి చెట్టుపై గురువారం మధ్యాహ్నం పిడుగుపడింది. మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం కాగా వర్షం వస్తుందనుకున్నారు. కానీ ఉరుములు, మెరుపులతో పిడుగు పడింది. కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కేవలం కొన్ని కొబ్బరి మండలు మాత్రం కాలిపోయాయి.

రోడ్డుపై కూలిన చెట్టు



డోర్నకల్ : స్థానిక చర్చి కాంపౌండ్‌లో రోడ్డుపై భారీ వేప చెట్టు కూలడంతో రాకపోకలతో పాటు కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బిషప్ గ్రౌండ్ పక్కన భారీ వేప చెట్టుకు ఇటీవల నిప్పంటుకుని మొదలు కాలి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు చెట్టుకు కూల్చే ప్రయత్నం చేయగా రోడ్డుకు అడ్డంగా కూలింది. సమీపంలోని విద్యుత్ తీగలు తెగడంతో సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికులు రోడ్డుకు అడ్డు గా చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడ : ఆదివాసీల ఆరాధ్య దైవం పామిడి పడగరాజు జాతర వాల్‌పోస్టర్‌ను ఆదివాసీ నాయకులు వేలుబెల్లి జాతర ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి మాట్లాడారు. ఆదివాసీల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు జాతరలు అని తెలిపారు. ఆదివాసీ జాతరలకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ధనసరి రవి, మంకిడి సతీష్, లక్ష్మయ్య, సమ్మయ్య, రమేష్, మనోజ్, రాకేష్, జనార్దన్ పాల్గొన్నారు.

నియామకం



తిప్పర్తి శ్రీధర్

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మహబూబాబాద్ పట్టణంలోని గుమ్ముడూర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు తిప్పర్తి శ్రీధర్ గురువారం నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- స్వీప్ నోడల్ అధికారి మరియన్న



కురవి: సీరోలు మండల కేంద్రంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మరియన్న

కురవి : అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి జినుగు మరియన్న అన్నారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు సీరోలు మండల కేంద్రంలో ఓటు హక్కు, ఓటు వేయడం ఒక సామాజిక బాధ్యత, వంద శాతం ఓటింగ్ తదితర అంశాలపై ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో ఓటర్లను కలసి వారికి అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 13వ తేదీన జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటుహక్కు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, తహసీల్దార్ శారద, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్, ఐకేపీ, అంగన్‌వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది, సమాచార పౌర సంబంధాల శాఖ కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం



గూడూరు: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న నాయకులు

గూడూరు : బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా నాయకుడు లింగాల సుధీర్ రెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలిపించాలని మండల కేంద్రంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు రాచకొండ కొమురయ్యగౌడ్, మేరెడ్డి సురేందర్, పడాల నాగరాజు, బల్సుకూరి సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథాలు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి ప్రాంగణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ ప్రచార రథాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర రావు, అజ్మీరా సీతారాంనాయక్ గురువారం ప్రారంభించారు. అనంతరం ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రరావు, జిల్లా అధికార ప్రతినిధి దార ఇందుభారతి, జిల్లా ఉపాధ్యక్షులు మోసంగి మురళి, పార్లమెంట్ కోకన్వీనర్ పింగళి సతీష్, నాయకులు శ్యామ్ సందర్‌శర్మ, అశోక్, శశివర్ధన్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, సందీప్,అజయ్ పాల్గొన్నారు.

'శరపంజరం' చిత్రాన్ని ఆదరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిత్రబృందం సభ్యులు

తొర్రూరు : గ్రామీణ జీవన నేపథ్యంలోని యదార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కిన 'శరపంజరం' చిత్రాన్ని ఆదరించాలని కథా నాయకుడు, చిత్ర దర్శకుడు గట్టు నవీన్‌కుమార్ కోరారు. తొర్రూరు మండలంలోని అమ్మాపురం వాసి నవీన్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శరపంజరం'. లయ కథానాయిక. జబర్దస్త్ వెంకీ, జీవన్, రాజమౌళి, ఆనంద్‌భారతి, వరంగల్ బాషా ప్రధాన పాత్రధారులు. టి.గణపతిరెడ్డి నిర్మాణంలో, మల్లిక్ ఎంవీకే స్వరాలు సమకూర్చాడు. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్‌లో భాగంగా గురువారం డివిజన్ కేంద్రంలో చిత్ర బృందం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. దర్శకులు నవీన్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలోని గంగిరెద్దుల వారి జీవనం, జోగిని వ్యవస్థల ఆధారంగా చిత్రం రూపొందిందన్నారు. ఇది పూర్తిగా జీరో బడ్జెట్ చిత్రమని, ఈ సినిమాలో పేరు మోసిన నటులు సైతం ఎలాంటి పారితోషికం ఆశించకుండా నటించారన్నారు. జీరో బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని థియేటర్లకు వెళ్లి చూడాలని కోరారు.

బైండోవర్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ శివారు సాంక్రియా తండాకు చెందిన గుడుంబా విక్రయదారుడు భూక్యా శ్రీనును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ సీఐ చిరంజీవి గురువారం తెలిపారు. మూడు కోట్లు వద్ద గుడుంబా విక్రయించేందుకు శ్రీను ద్విచక్ర వాహనంపై వస్తుండగా పట్టుకుని అతని వద్ద నుంచి 16 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచామని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్ : మానుకోట, తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న కార్మికల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె. రవి డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రసాద్, నర్సింహా, కుమార్, వెంకన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు కె.రవి, శ్రీనివాస్, ప్రసాద్ మాట్లాడుతూ.. మానుకోట, తొర్రూర్ మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు నర్సింహ, వెంకన్న మహేందర్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రత్యేక పూజలు



కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ నాయకుడు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు వద్దిరాజు రాంచంద్రరావు, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, నాయకులు కొణతం పెంటయ్య, బుడిగె భద్రసేనాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలి

దంతాలపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌కు పూర్తి మద్దతు తెలిపి గెలుపునకు కృషి చేయాలని హుస్సేన్ నాయక్ కోరారు. సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ చీకటి మహేష్ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ తాడ పూర్ణచందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నాయిని శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

నర్సింహులపేట : భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి సాధ్యమని ఇన్‌చార్జ్ ఏఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొమ్ములవంచలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో వచ్చే నమూనా అధారంగా ఎరువులను వాడితే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు.

రైల్వే రామాలయంలో అన్నదానం

డోర్నకల్ : శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా గురువారం రైల్వే కాలనీలోని రామాలయంలో అన్నదానం నిర్వహించారు. రైల్వే పీడబ్ల్యూఐలు శివకుమార్, శివాంజనేయులు, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఆర్.కనకరాజ్ ప్రారంభించారు. బెల్లి సర్వయ్య, నాగన్న, సతీష్‌కుమార్, తాళ్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

'బంజారాలపై చిన్నచూపు'

గార్ల : బంజారా నాయకులపై ఆయా రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఇల్లెందు ఏ-బ్లాక్ మాజీ అధ్యక్షుడు జర్పుల భీముడు నాయక్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బంజారా నాయకులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసినా కొంత మంది నాయకులు కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాజీ ఎంపీపీ బానోత్ అర్జున పాల్గొన్నారు.

రంగారెడ్డికి ఘన నివాళి

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రామసహాయం రంగారెడ్డి గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆయన దశ దినకర్మకు హాజరైన వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు రంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బుచ్చిరాములు మృతి ఇఫ్టూకి తీరనిలోటు

గార్ల : మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఇఫ్టూ నాయకులు దబ్బేటి బుచ్చిరాములు మృతి ఇఫ్టూకి తీరనిలోటని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సక్రు అన్నారు. గురువారం నిర్వహించిన బుచ్చిరాములు సంతాపసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మధు, నాగేశ్వరరావు, సుధాకర్, శ్రీను, కొమరయ్య, మల్లికాంబ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ నుంచి కృష్ణ, రామ్‌సింగ్ బహిష్కరణ

బయ్యారం : ఇఫ్టూ నుంచి ఆరెల్లి కృష్ణ, రామ్‌సింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కృష్ణ టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులుగా కొనసాగుతున్న రామ్‌సింగ్ ఆర్థిక అరాచకత్వం, విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇక నుంచి ఇఫ్టూతో కృష్ణ, రామ్‌సింగ్‌కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు.

టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్‌కు అంతరాయం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. బుధవారం సాయంత్రం పోలీసు స్టేషన్ ఆవరణలోగల కరెంట్ సరఫరా అయ్యే ప్యానల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ సమస్య ఏర్పడింది. కాగా తాత్కాలికంగా మరమ్మతులు చేయించగా మళ్లీ గురువారం అదే సమస్య ఏర్పడింది. పోలీసులు, సిబ్బంది ఎండ వేడికి తట్టుకోలేక ఉక్కపోతతో అవస్థలు పడాల్సి వచ్చింది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను పిలిపించి సమస్యను క్లీయర్ చేయించారు.

వృద్ధుడి మృతిపై అనుమానాలు?

కేసముద్రం : మండలంలోని కల్వల గ్రామానికి చెందిన కుదురుపాక అబ్బయ్య (65) పశువులకు మేత కోసేందుకు ఈనెల 16న వెళ్లి అక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు స్థానికులు, సమీప బంధువులు వడదెబ్బతో మృతి చెందినట్లు తెలిపారు. కాగా వైద్యులు మాత్రం మృతుడి శరీరంపై బొబ్బలు(చర్మం ఊడడం) రావడంతో విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు తమకు రాలేదని పోలీసులు చెప్పారు. దీంతో వృద్ధుడి మృతి పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వృద్ధుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడా? మరే కారణంగా మృతి చెందాడా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

పుస్తకాల పంపిణీ

కేసముద్రం : కేసముద్రం విలేజ్ జెడ్పీ హైస్కూల్‌లో నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్, ఆరోగ్య మిత్ర సంస్థల ఆధ్వర్యంలో గురువారం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అవుతున్న పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్, ఐఐటీ, జేఈఈ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఇస్లావత్ సుమన్, మూడావత్ మోహన్ పాల్గొన్నారు.

మొబైల్ నంబర్ మార్చరూ!



మహబూబాబాద్ రూరల్ : ఉపయోగంలో లేని (నాట్ వర్కింగ్) ఎస్‌హెచ్‌ఓ మొబైల్ నంబర్‌తో ఫిర్యాదుదారుకు రశీదు ఇచ్చిన సంఘటన మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. వివరాలు.. మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాధితులకు గొడవ జరిగింది. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సదరు బాధితులకు అక్కడి రిసెప్షన్ సెంటర్ ద్వారా ఇచ్చిన రశీదుపై పనిచేయని ఎస్‌హెచ్‌ఓ ఫోన్ నంబర్ (94409 04640) ముద్రితమై ఉండగా రూరల్ సీఐ ఫోన్ నంబర్ మాత్రం ముద్రించి ఉంది. ఏదైనా సమాచారం కోసం సంప్రదించాల్సిన ఎస్‌హెచ్‌ఓ మొబైల్ నంబర్ తప్పుగా ఉంటే తాము ఎవరిని అడగాలని బాధితులు వాపోయారు. ఈ విషయమై రూరల్ ఎస్సై దీపికరెడ్డిని వివరణ కోరగా పాత ఎస్‌హెచ్‌ఓ నంబర్ స్థానంలో కొత్త నంబర్ అప్‌డేట్ అయి ఉండక పోవచ్చని పేర్కొన్నారు. అయితే ఎస్‌హెచ్‌ఓ ఫోన్ నంబర్ మారి సుమారు తొమ్మిది నెలలు కావొస్తున్నా దాని స్థానంలో కొత్త ఫోన్ నంబర్‌ను అప్‌డేట్ చేయకపోవడం గమనార్హం.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఎంసెట్ కోచింగ్‌కు ఉత్తమ కళాశాలలను ఎంపిక చేయడానికి జిల్లాలోని అర్హత గల ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ అధికారి ఆర్. బాలరాజు గురువారం తెలిపారు. ఎంపిక చేసిన కళాశాలలకు విద్యార్థులను ఆప్షన్ ప్రకారం ప్రతి ఏటా కేటాయించడం జరుగుతుందని, కార్పొరేట్ కళాశాల పథకంలో భాగంగా విద్యార్థుల ఫీజు, బుక్స్, హాస్టల్, భోజనం వసతి, ఇతర అవసరాలకు ప్రతి విద్యార్థికి రూ.35,000 చొప్పున, పాకెట్ మనీగాను ప్రతి విద్యార్థికి రూ. 3,000 చొప్పున చెల్లిస్తామన్నారు. అర్హత గల ప్రైవేట్ కళాశాలల యజమాన్యం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈపాస్.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 19 నుంచి 27 తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 98499 43887, 94401 20620 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫాసిస్టు బీజేపీని ఓడించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కేసముద్రం : ఫాసిస్టు విధానాలను అవలంబిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో కేసముద్రం, నెల్లికుదురు మండలాల పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో అదే పాత నినాదాలకు కొత్త రంగులను అద్ది భూతద్దంలో పెట్టి హామీల వర్షం కురిపిస్తున్నారన్నారు. స్విస్ బ్యాంకులో దాచిన నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతీ కుటుంబానికి రూ.15లక్షల చొప్పున ఖాతాల్లో వేస్తానని చెప్పి పదేళ్లు దాటినా ఏ ఒక్కరి ఖాతాల్లో నగదు పడలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి రాజన్న, మండల కార్యదర్శులు మోడెం వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల తిలక్‌బాబు, మార్తనేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, చాగంటి కిషన్, ఏల్పుగొండ సావిత్ర, నర్సయ్య, వెంకన్న, సైదులు, జల్లె జయరాజ్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజు

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మేడే (కార్మికుల దినోత్సవం) ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ కన్‌స్ట్రక్షన్ జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కేంద్రంలో సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను నీరుగార్చే విధంగా ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని విమర్శించారు. కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు, ఉద్యోగ భద్రత, జీవిత బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మేడే వేడుకల సందర్భంగా గ్రామ గ్రామాన జెండాలు ఎగురవేసి ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గుణగంట్ల రాము, గేరా కోటేశ్వర్‌రావు, ముల్క మురళి, కారపాటి వెంకన్న, పానుగోటి యాదగిరి, బడేటి సైదులు, బలుగూరి శ్రీశైలం, రాజు, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

- ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్



మరిపెడ: కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న దస్రూనాయక్



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మరిపెడ రూరల్ : కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు మేలు కలుగుతుందని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నేత, కాంట్రాక్టర్ కొంపెల్లి సురేందర్‌రెడ్డి, బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత మచ్చ వెంకటనర్సు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్లి రఘువీరారెడ్డి, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, కొండం దశరథం, గుగులోత్ దస్రునాయక్, అబీబుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మరిపెడ : మరిపెడ పట్టణంతో పాటు వివిధ వార్డులకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు 9వ వార్డు కౌన్సిలర్ వీసారపు ప్రగతిశ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ సమక్షంలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్ నాయకుల చేరిక

కురవి : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి గురువారం మరిపెడ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి)కి చెందిన సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, భరద్వాజ్‌రెడ్డి, కురవి గ్రామ మాజీ సర్పంచ్ బానోత్ తుకారంనాయక్, ఎస్సీ సెల్ నాయకుడు దైద భద్రయ్య, బాలాజీనాయక్, రాములు వెంకన్న తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌లు పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

డోర్నకల్ : డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. డోర్నకల్‌లో గురువారం కాంగ్రెస్ మున్సిపాలిటీ స్థాయి సమావేశం నిర్వహించారు. నేడు(శుక్రవారం) మహబూబాబాద్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు డోర్నకల్ నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి జనజాతరను విజయవంతం చేయాలి

కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నేడు(శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే జన జాతర బహిరంగసభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ నామినేషన్ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. అదే విధంగా జన జాతర బహిరంగ సభకు మండలం నుంచి 10వేల మందికి పైగా తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారి వెంకన్న, దయాకర్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలేపాక నాగరాజు, పట్టణ అధ్యక్షుడు రావుల మురళి, మహ్మద్ నవాజ్ అహ్మద్, మిట్టకడుపుల యాకూబ్, నూకల వెంకటేశ్వర్లు, రాజులపాటి మల్లయ్య పాల్గొన్నారు.

వేం నరేందర్ రెడ్డిని కలిసిన నాయకులు

మహబూబాబాద్ రూరల్/ కేసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో కలసి రావాలని వేం నరేందర్ రెడ్డి సీపీఐ నేతలను కోరారు. అనంతరం బి.విజయసారధి మాట్లాడుతూ మానుకోట అభివృద్ధికి కలిసి పనిచేద్దామని కోరారు. మూడు తరాల తెలంగాణ ఉద్యమంపై తాను రచించిన తెలంగాణ జాతిపోరు వీడియో ఆల్బం ఆవిష్కరణకు రావాలని ఆహ్వానించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెరుగు కుమార్, కేసముద్రం మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రవీందర్ ఉన్నారు. అలాగే వేం నరేందర్‌రెడ్డి గురువారం కేసముద్రం మండలంలోని అర్పనపల్లి గ్రామానికి రాగా పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రునాయక్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, మల్లయ్య, భిక్షపతి, యాకాంబ్రం పాల్గొన్నారు.